
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16
కరీంనగర్
సోమవారం ○ 28-8-2017





మాటల్లో పెట్టి మాయ చేస్తున్నారు

- జిల్లాలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు
- ఆరు రోజుల్లో రెండు ఘటనలు..
- ప్రజల అప్రమత్తతతోనే నేరాల కట్టడి

కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన ములుగూరు రాములు అనే రిటైర్డ్ ఉద్యోగి తన బ్యాంక్ ఖాతాలోని డబ్బులు తీసుకోవడానికి మంకమ్మతోటలోని ఎస్‌బీహెచ్ ఏటీఎంకు వెళ్లాడు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తి సహాయం చేస్తున్నట్లు నటించి రాములు కార్డును తారుమారు చేశాడు. గమనించని రాములు ఏటీఎంలో డబ్బులు రాలేదని ఇంటికి వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసినట్లు ఆయన ఫోన్‌కు మెస్సేజ్ వచ్చింది. వెంటనే బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీయగా 50 వేలు డ్రా అయినట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. దీంతో రాములు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా జిల్లా వ్యాప్తంగా మోసాలు జరుగుతున్నాయి.. బ్యాంకు అధికారులమంటూ ఫోన్‌చేసి డెబిట్ కార్డుల వివరాలు తెలుసుకుని బ్యాంకు ఖాతాల్లోంచి సొమ్ములు స్వాహా చేస్తున్నారు.. బాధితుల్లో విద్యావంతులు కూడా ఉంటున్నారు.. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మవద్దని, ఖాతా, డెబిట్ కార్డుల వివరాలు చెప్పవద్దని అధికారులు అంటున్నారు.. ఏటీఎంల వద్ద అపరిచిత వ్యక్తులకు కార్డులు ఇవ్వవద్దని, పిన్ నంబర్ చెప్పవద్దని సూచిస్తున్నారు.

-కరీంనగర్ క్రైం

2

కాళేశ్వరంపై ప్రజాభిప్రాయ సేకరణ ఒక డ్రామా..

- ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు రావాలి
- జడ్పీ సమావేశంలో మెడికల్ కళాశాలపై తీర్మానం చేయాలి
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్

-కరీంనగర్ అర్బన్

6



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం

చి(చె)త్త శుద్ధి ఏది..?



భాగ్యనగర్ న్యూ లేబర్ అడ్డా సమీపంలో పేరుకుపోయిన చెత్త

- పడకేసిన పారిశుధ్యం
- కంపు కొడుతున్న కాలనీలు
- 'బల్దియా'పై విమర్శల వెల్లువ

-కరీంనగర్ టౌన్

2

అలరించిన కవితాగానం..

- జాగృతి ఆధ్వర్యంలో కవితాంజలి
- తెలంగాణ సాహిత్య వైభవం ప్రపంచానికి చాటుదాం
- ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్

-కరీంనగర్ కల్చరల్

16




సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి..

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు..
- ఎయిర్‌పోర్టుకు వెళ్లవస్తుండగా సిద్దిపేట జిల్లాలో ఘటన
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

-గన్నేరువరం

3





బత్తిని రమేశ్(ఫైల్), మాంకాలి అనిల్(ఫైల్)

చి(చె)త్తశుద్ధి ఏదీ..?


సర్కస్‌గ్రౌండ్‌లో పేరుకుపోయిన చెత్త

కరీంనగర్ టౌన్: స్మార్ట్‌సిటీ వైపు అడుగులు వేస్తున్న కరీంనగర్‌లో ఎక్కడ చూసినా చెత్తాచెదారమే కనిపిస్తోంది. రోజూ 800 మంది కార్మికులు పారిశుధ్య విభాగంలో పని చేస్తున్నప్పటికి ప్రధాన రహదారుల తోపాటు గల్లీ రోడ్లన్నీ చెత్తతో దర్శనమిస్తున్నాయి. పందులు, దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. నగర నడిబొడ్డున నిత్యం రద్దీగా ఉండే సర్కస్ గ్రౌండ్‌లో చెత్తా చెదారం వేసి డంపింగ్‌యార్డుగా మార్చివేస్తున్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలను తయారు చేసి విక్రయించిన జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయింది. ఎస్‌బీఐ, ఆంధ్రాబ్యాంకు సమీపంలోని పూల దుకాణాలు, వస్త్రదుకాణాల నుంచి వెలువడిన చెత్తను రోడ్డుపైనే పడవేయడంతో ఆ ప్రాంతం చెత్తకుండీలా తయారైంది. ఇలా ప్రధాన రహదారుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోయినా పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణకు ఏటా కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నప్పటికి ఆశించిన మేరకు పనులు జరుగడం లేదని, చెత్తను తొలగించడంలో బల్దియా ఉద్యోగులు, కార్మికులకు చిత్తశుద్ధి లేకుండా పోయిందని వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలే కాకుండా గల్లీ రోడ్లు, ప్రధాన రహదారుల్లోని డివైడర్లు, మురుగునీటి కాలువల పక్కన దర్శనమిస్తున్న చెత్తను చూసి ప్రజలు నివ్వరపోతున్నారు. వర్షంతో చెత్త తడిసిపోయి దుర్వాసన వెదజల్లుతోందని, పందులు, దోమలు విపరీతంగా వృద్ధి చెంది రోగాలపాలవుతున్నామని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గణేశ్‌నవరాత్రోత్సవాలు జరుగుతున్న సమయంలో పారిశుధ్య పనులను మెరుగుపరచాలని ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాలు, ప్రజలు కోరుతుంటే పండుగ రోజుల్లో పారిశుధ్యాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని ప్రధాన రహదారులతోపాటు గల్లీరోడ్లలో పేరుకు పోయిన చెత్తకుప్పలను తొలగించి, బ్లీచింగ్‌తోపాటు దోమల, పందుల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మాటల్లో పెట్టి... మాయ చేస్తున్నారు...

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని రెండో ఠాణా సీఐ చాంబర్.... ఆగస్టు 6వ తేదీ.. ఉదయం 11 గంటల సమయం.... సార్ నా పేరు గట్టు రాములు ఈ రోజు ఉదయం నాకు ఎస్‌బీహెచ్ అధికారి నుంచి ఫోన్ వచ్చింది. మీ ఏటీఎం కార్డు గడువు ముగిసింది... కొత్త కార్డు జారీకి వివరాలు కావాలని అడిగాడు... నేను నమ్మాను... నా ఏటీఎం కార్డు పిన్ నంబర్‌తోపాటు నా ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్‌ను తెలిపాను. నా భార్య సరోజన ఏటీఎం కార్డు వివరాలను కూడా అడగగా చెప్పాను.... పది నిమిషాల్లో మా ఇద్దరి ఫోన్‌లకు మెస్సేజ్‌లు వచ్చాయి. నా ఖాతా నుంచి 27 వేలు, సరోజన ఖాతా నుంచి 50 వేలు డ్రా అయినట్లు మెస్సేజ్‌లో ఉన్నది. వెంటనే బ్యాంక్‌కు వెళ్లి అడగగా తాము ఎటేవంటి ఫోన్ చేయలేదని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మందుల కోసం దాచుకున్న డబ్బులు మాయం చేశారు. నాకు న్యాయం చేసి డబ్బులు ఇప్పించండి. ఇది కరీంనగర్ రెండవ ఠాణా సిఐ టి మహేష్‌గౌడ్‌కు బాధితుడు ఫిర్యాదు చేసిన ఘటన...



● పదుల సంఖ్యలో ఫిర్యాదులు

ఏటీఎం కార్డుల ద్వారా డబ్బులు స్వాహా చేస్తున్నారంటూ ఇటీవల పదుల సంఖ్యలో ఫిర్యాదులు పోలీసులకు అందుతున్నాయి. మోసాలకు పాల్పడుతున్న నేరస్థులు, దొంగలు రోజుకో కొత్త శైలిలో బాధితులకు మస్కా కొడుతూ డబ్బులను నొక్కేస్తున్నారు. ఏటీఎం కేంద్రాలు, డెబిట్ కార్డులే లక్ష్యంగా ఈ చోర ముఠాలు రెచ్చిపోతున్నాయి. జిల్లాలో ఇటీవల వరుసగా సైబర్ నేరాలు జరుగుతున్న క్రమంలో పోలీస్ అధికారులు నేరస్థులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మరో వైపు ఇటువంటి మోసాలపై జాగ్రత్తగా ఉండాలంటూ కరపత్రాలు, మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని బ్యాంకుల యాజమాన్యాలకు సమాచారం అందిస్తున్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇకపై జాగ్రత్తలు పాటించాలంటూ సర్దిచెప్తున్నారు.

● పది రోజుల క్రితం కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన విశ్వనాథంకు ఫోన్ వచ్చింది. తాను ఎస్‌బీహెచ్ ప్రధాన కార్యాలయం మేనేజర్‌ను మాట్లాడుతున్నానని, ఏటీఎం పిన్ నంబర్లు తనిఖీ చేస్తున్నామని చెప్పాడు. విశ్వనాథం నిజమా కాదా అని తెలుసుకునేందుకు వచ్చిన నంబర్‌ను ట్రూకాలర్‌లో చూసుకుంటే ఎస్‌బీహెచ్ మేనేజర్ అని వచ్చింది. నమ్మిన విశ్వనాథం ఏటీఎం పిన్ నంబర్ చెప్పాడు. అనంతరం సెల్‌ఫోన్‌కు డబ్బులు విత్‌డ్రా అయినట్లు మెసెజ్‌లు వస్తుండగా అనుమానం వచ్చి బ్యాంకుకు వెళ్లి సంప్రదించగా 50 వేల రూపాయలు ఖాతా నుంచి విత్‌డ్రా అయ్యాయి. బాధితుడు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేయగా కసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఏటీఎం కేంద్రాల్లో..

ఏటీఎం కేంద్రాల్లో నగదు విత్‌డ్రా చేసుకునేవారిని సైబర్ నేరగాళ్లు, దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. నగరంలో రద్దీ తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ఏటీఎం కేంద్రాల వద్ద కాపు కాస్తున్నారు. ఏటీఎం కార్డుల వివరాలను కనిపెడుతున్నారు. ఏటీఎం యంత్రానికి ప్రత్యేక పరికరం అమర్చి కార్డు వివరాలను చోరీ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయింది. ఇటువంటి సైబర్ నేరాల్లో 80 శాతం మంది నగదు విత్‌డ్రా చేసుకునేందుకు వచ్చే వారిని గుర్తించి 'నేను సహాయం చేస్తాను' అంటూ మాయమాటలు చెప్పి వేలు, లక్షలు స్వాహా చేస్తున్నారు. మిగిలిన 20 శాతం అత్యాధునిక పరికరాలతో ఏటీఎం కార్డులను మార్చి డబ్బులను దోచుకుంటున్నారు.

● నిమిషాల వ్యవధిలోనే..

బ్యాంకు అధికారులు, ఖాతాదారులకు మాత్రమే తెలిసిన డెబిట్ కార్డు నంబర్లను దొంగలు సేకరిస్తున్నారు. వినియోగదారుడి సెల్‌ఫోన్ నంబర్‌ను తెలుసుకుని వారి ఖాతాల్లో ఉన్న డబ్బును నిమిషాల వ్యవధిలో మొబైల్ యాప్ ద్వారా బదిలీ చేసుకుంటున్నారు. బీహార్, జార్ఖండ్, ఢిల్లీ, నోయిడా తదితర ప్రాంతాల నుంచి ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. రహస్య సమాచారం బయటకు వెళ్లకుండా చూసుకోవాలని బ్యాంకు అధికారులకు పోలీసులు సూచిస్తున్నారు. బ్యాంకులు డెబిట్, క్రెడిట్ కార్డుల జారీని ఔట్‌సోర్సింగ్‌కు అప్పగించాయి. వారి ద్వారా కార్డులను ఖాతాదారులకు పంపుతున్నాయి. ఈ ఔట్‌సోర్సింగ్ సేవల విభాగంలోని కిందిస్థాయి సిబ్బందిని ప్రలోభపెట్టి వేర్వేరు రాష్ట్రాలకు చెందిన బ్యాంకు ఖాతాదారుల కార్డుల వివరాలను తీసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

ఈ నెల 9న కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన సింగిరి ఊశయ్యకు ఫోన్‌చేసిన అపరిచిత వ్యక్తి తాను ఎస్‌బీహెచ్ మేనేజర్‌నని చెప్పాడు. ఏటీఎం కార్డు ఆధార్‌కార్డుకు అనుసంధానం చేయాలని, లేకుంటే ఏటీఎం పనిచేయదని నమ్మించాడు. నమ్మిన ఊశయ్య ఆధార్‌కార్డు నంబర్, ఏటీఎం పిన్ నంబర్ చెప్పాడు. ఊశయ్య ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసెజ్‌లు వచ్చాయి. బ్యాంక్‌కు వెళ్లి చూడగా 49,948 రూపాయలు డ్రా అయ్యాయి.

● సీవీవీ నంబర్‌ను గుర్తించి...

దొంగలు, నేరస్థులు ఏటీఎంలో నగదు తీసుకునేందుకు వస్తున్న వారి కార్డు నంబర్లు, కార్డులో వివరాలను, సీవీవీ నంబర్‌ను వేగంగా గుర్తుంచుకొని కాగితాలపై రాసుకుంటున్నారు. అనంతరం ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లి ఆ వివరాలను నమోదు చేసి ఖరీదైన వస్తువులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

● మోసపోతున్న విద్యావంతులు

గ్రామీణ ప్రాంత ఖాతాదరులకు ఏటీఎం కార్డు లావాదేవీలపై అంతగా అవగాహన ఉండే అవకాశం ఉండదు. ఇటువంటి వారిని సైబర్ నేరస్థులు సులువుగా బురిడీ కొట్టించే అవకాశముటుంది. విద్యావంతులైన ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, పోలీసుల కూడా ఈ మోసగాళ్ల ఉచ్చులో ఇరుక్కుని లక్షల్లో డబ్బులు పోగొట్టుకుంటున్నారు. బ్యాంక్ అధికారులు ఏటిఎం కార్డు గురించి ఫోన్‌లో సమాచారం అందించాలని కోరరు అనే విషయాన్ని ప్రాథమికంగా గుర్తుంచుకోవాలి. బ్యాంక్‌ల వద్ద నోటీసు బోర్డుల్లో కూడా ఈ విషయాన్ని తెలియజేసే ప్రకటనలు ప్రదర్శిస్తున్నారు.

● ఏటీఎంల వద్ద సెక్యూరిటీ లేక...

70 శాతం బ్యాంక్ ఏటీఎంల వద్ద ఎలాంటి సెక్యూరిటీ గార్డులు లేరు. ప్రతి ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించాలని పోలీసు అధికారులు పలుమార్లు బ్యాంక్ అధికారులను కోరినా పట్టించుకోవటం లేదు. సెక్యూరిటీ గార్డులు లేని ఏటీఎంల వద్దనే ఇటువంటి మోసాలు మళ్ళీ మళ్ళీ చోటు చేసుకుంటున్నాయి.

● ఇంటర్‌నెట్ ఫోన్ ద్వారా..

సైబర్ నేరాల కొత్త అస్త్రమే ఇంటర్‌నెట్ ఫోన్. వాస్తవానికి ఐపీ ఫోన్ వినియోగం కొత్తదికాదు. అమెరికా వంటి ఇతర దేశాల్లో ఉన్న బహుళజాతి సంస్థలు వారి కాల్ సెంటర్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో హైదరాబాద్, ముంబాయి, ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై తదితర పట్టణాల్లో ఏర్పాటు చేసి ఇక్కడి నుంచి ఆయా కంపెనీల వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. ఇందుకోసం వారు ఇంటర్‌నెట్ ఫోన్లు (ఐపీ) ఉపయోగిస్తున్నారు. చట్టబద్ధంగా భారతదేశంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ నిర్వాహకుల ద్వారా ఇంటర్‌నెట్ సౌకర్యం పొంది కాల్‌సెంటర్లను నిర్వహిస్తున్నారు. సరిగ్గా ఇదే పద్ధతిని ఇటీవల నేరస్థులు వాడుతున్నారు..

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

● ఏటీఎం కార్డు నెంబర్‌ను ఫోన్‌లో బ్యాంకు అధికారులు ఎప్పుడు అడగరు. వివరాలు అప్‌డేట్ చేస్తామని ఎవరైనా చెప్పినా నమ్మవద్దు.

● కార్డులో మొదటి 8 నంబర్లను మోసగాళ్లు చాలా తేలికగా చెప్పేస్తారు. దీంతో ఫోన్‌చేసినవారు బ్యాంకు అధికారులుగా ఖాతాదారులు నమ్ముతారు. సైబర్ నేరస్థుల వద్ద డెబిట్‌కార్డు వెనుక వైపు ఉండే సీవీవీ (కార్డ్ వెరిఫికేషన్ వాల్యూ) సంఖ్య ఉండదు. దీనికోసం వారు చాలాసేపు మాటల్లో పెడతారు. సీవీవీ నంబర్ మనం చెప్పగానే సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ (వన్‌టైమ్ పాస్‌వర్డ్) చెప్పమంటారు. ఇటువంటి వివరాలేవీ అపరిచితులకు చెప్పవద్ద.

● పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు జారీ చేస్తామని, రెండు రోజుల్లో బ్యాంకుల నుంచి తీసుకోవచ్చంటూ మరికొందరు దొంగలు ఖాతాదారులకు ఫోన్ చేస్తుంటారు. డెబిట్ కార్డు వివరాలు మిమ్మల్ని అడగగానే తక్షణం ఫోన్ కట్ చేయండి.

● నగదు కోసం ఏటీఎంలకు వెళ్లేటప్పుడు పక్కన ఎవరైనా ఉంటే కొంచెం దూరంగా వెళ్లాలి. మిమ్మల్ని గమనిస్తున్నారన్న అనుమానం రాగానే నగదు విత్‌డ్రాను నిలిపివేయాలి.

● నగదు తీసుకునేప్పుడు ఏటీఎం వద్ద అంకెలపై నొక్కే క్రమంలో ఏదైనా తేడాగా కనిపిస్తే వెంటనే వేరే కేంద్రానికి వెళ్లాలి

● కీబోర్డుపై నేరస్తులు కనిపించని విధంగా ఉండే పేపర్ ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. దీని ద్వారా పిన్ నంబర్‌ను తెలుసుకుంటారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

● శంషాబాద్ విమానాశ్రయం నుంచి గన్నేరువరం వస్తుండగా ఘటన ● మరో ఇద్దరికి తీవ్రగాయాలు

గన్నేరువరం: కొండపాక శివారు మల్లన్న గుట్ట సమీపంలోని రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గన్నేరువరానికి చెందిన బత్తిని శేఖర్(23) సౌదీలో ఉండి, ఆదివారం స్వగ్రామానికి తిరిగివస్తున్నాడు. శేఖర్‌ను శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆదివారం తెల్లవారుజామున గన్నేరువరానికే చెందిన కూన సంతోష్(27)కారులో తీసుకుని తండ్రి సమ్మయ్య, అన్నయ్య రమేశ్(28)లు బయలుదేరారు. వారితో సంతోష్ స్నేహితుడైన చొక్కారావుపేటకు చెందిన మహంకాళి అనిల్(28) కూడా ఉన్నాడు. అయితే కొండపాక శివారులో చేరుకున్నారు. అక్కడ ఇసుప చువ్వల లోడుతో ఆగి ఉన్న ట్రాయిలర్‌కు కారు ఢీ కొట్టి లారీ కిందకు దూసుకెళ్లింది. లారీని వెనుకనుంచి ఢీకొట్టగా కారు ముందు సీటులో కూర్చున్న అనిల్, వెనుక సీటులో కూర్చున్న రమేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవర్ సంతోష్, శేఖర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన వారిని 108 అంబులెన్స్ సిబ్బంది, కుకునూర్‌పల్లి పోలీసులు, టోల్‌గేట్ సిబ్బంది బయటకు తీశారు. గాయపడిన వారిని సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.



కారులో మృతదేహాలు , రమేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మరణంలోనూ వీడని స్నేహం

కారులో వెళ్లిన మాంకాళి అనిల్, బత్తిని రమేశ్, కూన సంతోష్‌లు ప్రాణ స్నేహితులు. మృతిచెందిన బత్తిని రాయమల్లు ఏడాదిన్నర క్రితం కొత్తపల్లికి చెందిన సరితతో వివాహం జరిగింది. మృతుడు బత్తిని రాయమల్లు ఒడ్డెర పని చేసుకుంటూ బండలు జీవనోపాధి పొందుతుండగా సౌదీ నుంచి వచ్చిన తమ్ముడు బత్తిని రాజశేఖర్(23) గన్నేరువరంకు తన స్నేహితులు కూన సంతోష్, మాంకాళి అనిల్‌తో కలిసి కారులో వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. మృతుడు మాంకాళి అనిల్ చొక్కారావుపల్లి గ్రామానికి చెందిన మాంకాళి మల్లయ్య, మల్లవ్వ పెద్దకుమారుడు. అనిల్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. చొక్కారావుపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

ఆరుగురి పేకాట రాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం : కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో ఒక ఇంటిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం జ్యోతినగర్‌లోని ఇంటిపై దాడి చేయగా ఆరుగురు పట్టుబడ్డారు.

ఇందులో కొలాడి బాలకిషన్‌రావు, అయిల్నేని రామారావు, చెన్నమనేని రాంమోహన్, శివప్రసాద్, జువ్వాడి రవీందర్‌రావు, జువ్వాడి వెంకట్‌రావులు ఉన్నారు. పట్టుబడిన ఆరుగురి వద్ద నుంచి 39,660 రూపాయల నగదు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రెండవ టౌన్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగిత్యాలలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు



బాస్కెట్ బాల్ ఆడుతున్న విద్యార్థులు

జగిత్యాల అర్బన్ : జగిత్యాలలో సెప్టెంబర్ 9,10 తేదిల్లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు బాస్కెట్ బాల్ అసోషియేషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ బాలబాలికల జట్లను ఆదివారం ఎంపిక నిర్వహించినట్లు బాస్కెట్ బాల్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి బి.ఆనంతరెడ్డి తెలిపారు. ఇందులో మొత్తం 46 మంది బాలురు, 30 మంది బాలికలు పాల్గొనగా, ఇందులోంచి బాలబాలికల విభాగాల్లో 12 మంది , నలుగురు స్టాండ్‌బై కోసం చొప్పున మొత్తం 16 మంది క్రీడాకారులను వేరు వేరుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు, పీడీలు పి.విశ్వప్రసాద్, జి.నిరంజన్, కె.రవికుమార్, జి.శ్రీధర్‌రావు, పి.కృష్ణప్రసాద్, అజయ్, ప్రేమ్, సాగర్, వేణు, సుధాకర్, ప్రశాంత్, సామంత్, సతీష్, సుమిత్ స్వామ్రాట్, మంగ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో రౌడీ షీటర్ దారుణ హత్య

● ఇంట్లో నరికి చంపిన దుండగులు ● భూవివాదంలో తలదూర్చడమే కారణమా?



మృతుడి భార్య నుంచి వివరాలు సేకరిస్తున్న సీపీ



హత్యకు గురైన బుగ్గల శ్రీనివాస్

గోదావరిఖని: గోదావరిఖని ఉదయ్‌నగర్‌లో ఆదివారం ఉదయం రౌడీషీటర్ అరుకోళ్ల శ్రీనివాస్ అలియాస్ బుగ్గల శ్రీనివాస్(45) దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు ఇంట్లోకి చొరబడి కత్తులతో నరికి చంపారు. అడ్డువచ్చిన అతని భార్య అంజలిపై సైతం దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఆమె చేతికి తీవ్ర గాయమైంది. ఘటనకు సంబంధించి మృతుడి భార్య అంజలి తెలిపిన వివరాలు...

అరుకోళ్ల శ్రీనివాస్ కుటుంబం కొంత కాలంగా ఉదయ్‌నగర్‌లోని సింగరేణి క్వార్టర్‌లో నివాసముంటుంది. ఆదివారం ఉదయం శ్రీనివాస్, అతని భార్య మాట్లాడుకుంటుండగా పాత నేరస్థుడు పెద్ది రవిశంకర్ లోనికి వచ్చి శ్రీనివాస్‌ను పలుకరించాడు. అతడు కనబడకుండా కత్తిపెట్టుకోవడం గమనించిన శ్రీనివాస్ భార్య అంజలి అతన్ని అడ్డుకుంది. దీంతో అతడు మొదట ఆమెపై దాడి చేశాడు. ఆమె భయంతో పరుగులు తీసింది. వెంటనే శ్రీనివాస్‌పై దాడి చేశాడు. బయట ఉన్న మరో ఐదుగురు వ్యక్తులు లోనికి చొరబడి శ్రీనివాస్ తల, మెడను నరికారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆటోలో పరారయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఉదయ్‌నగర్ ప్రధానరహదారి పక్కనే ఉన్న క్వార్టర్‌లోనే ఈ ఘటన చోటు చేసుకున్నది. అంజలి అరుపులతో జనం పెద్ద ఎత్తున పోగయ్యారు. రామగుండం సీపీ విక్రమ్‌జీత్‌దుగ్గల్, డీసీపీ విజేందర్‌రెడ్డి, ఏసీపీ అపూర్వరావు, వన్‌టౌన్ సీఐ గజ్జి కృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బుగ్గల శ్రీనివాస్ పలు హత్య కేసుల్లో నిందితుడు

మృతుడు బుగ్గల శ్రీనివాస్ గోదావరిఖని ప్రాంతాల్లో జరిగిన పలు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ ఎర్రగోళ్ల రమేష్ హత్య కేసులో ప్రధాన నిందితుడు. ఈ కేసులో శ్రీనుకు సహకరించారని పోలీసు అధికారులైన రాజేంద్రప్రసాద్, విద్యాసాగర్‌లపై కూడా సీబీసీఐడీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది. ఇదే కాకుండా గంగానగర్‌లో జరిగిన అంతర్గాం సర్పంచ్ చింతల ప్రశాంత్, జీఎం కాలనీలోని జరిగిన పుట్ట శారద హత్య కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్నారు. కానిస్టేబుల్ రమేష్ మరణంపై విచారణ జరిపిన పోలీస్ ప్రత్యేక బృందం చింతల ప్రశాంత్, పుట్ట శారద హత్య కేసుల్లో కూడా శ్రీనివాస్ ప్రమేయం ఉన్నట్టు గుర్తించింది. ఆ కేసుల్లో నిందితుడిగా చేర్చారు. అనంతరం అతనిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారు.

భూ వివాదాల్లో జోక్యమే హత్యకు కారణమా...

బుగ్గల శ్రీనివాస్ ఒక దినపత్రికలో పాత్రికేయుడిగా పని చేస్తున్నాడు. పలువివాదాల సెటిల్‌మెంట్లలో తలదూర్చినట్టు ప్రచారం జరుగుతుంది. మంచిర్యాలకు సంబంధించి ఒక భూవివాదంలో తలదూర్చడం వల్లే హత్యకు దారితీసినట్టు తెలుస్తున్నది. స్థానిక ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి మంచిర్యాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడని, గోదావరిఖనిలో ఒక వ్యక్తి వద్ద డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించే విషయంలో వివాదం చోటు చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ వివాదంలో జోక్యం చేసుకున్న బుగ్గల శ్రీనివాస్ పలుమార్లు చర్చించినట్టు తెలుస్తున్నది. ఈ విషయంలో విభేదించిన ప్రశాంత్‌నగర్‌కు చెందిన వ్యక్తితో పాటు మరికొందరు బుగ్గల శ్రీనివాస్ హత్యకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అతని భార్య అంజలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు పెద్ది రవిశంకర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గంగాధర : గంగాధర మండల కేంద్రంలో శనివారం రాత్రి తాపీ మేస్త్రీ పని చేసే రాజ్‌కుమార్ (45) అనే వ్యక్తి క్రిమిసంహార మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై స్వరూప్ రాజ్ చెప్పారు. కుటుంబ కలహాలు తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారని ఎస్సై వివరించారు.

పచ్చునూర్‌లో పేకాటరాయుళ్ల అరెస్టు

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో ఆదివారం 9 మందిపేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పచ్చునూర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 9 మంది పేకాటరాయుళ్లతో పాటు రూ. 16325 నగదు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుడిలో చొరబడిన ఎలుగుబంటి

సుల్తానాబాద్: మండలంలోని కనుకుల గ్రామపంచాయతీ పరిధిలోని రాములపల్లిలో శ్రీరామాలయంలో శనివారం రాత్రి ఎలుగుబంటి రావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. గణపతి నవరాత్రులు కావడంతో భక్తులు పూజలు చేస్తుండగా సమీపంలోని గుట్టల నుంచి బల్లూకం గ్రామంలోకి వచ్చి ఆలయంలోని నవగ్రహాల మందిరంలోకి చొరబడింది. యువకులు ధైర్యం చేసి తలుపులు వేసి గడియ పెట్టారు. గ్రామస్తులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాజు, అటవీశాఖ అధికారులు వచ్చి ఎలుగుబంటిని పట్టుకోవడంతో గ్రామస్థులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



చెట్టును ఢీకొన్న కారు

వేములవాడ టౌన్ : రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మండలం ఫాజుల్‌నగర్‌లో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం దైవదర్శనానికి ధర్మపురికి వెళ్లి శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించుకుని తిరిగి వేములవాడకు శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తూ ఫాజుల్‌నగర్ గ్రామంలో మూలమలుపు వద్ద ప్రమాదశాత్తు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో భాగ్యలక్ష్మి, వెంకట్, సురేఖలకు వెన్నుముకకు గాయాలు కాగా హన్మాండ్లకు కాలు విరిగి త్రీగాయాలైనట్లు తెలిపారు. స్థానికులు వెంటనే 108కి సమచారం అందించడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీ కొని యువకుడి మృతి

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎరడపల్లి గ్రామ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఇదే గ్రామానికి చెందిన దూడం రాజమౌళి (35) అనే యువకుడు ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో రాజమౌళి రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. రాజమౌళిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆటోలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ ఎల్ శ్రీను తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, గుర్తు తెలియని ట్రాక్టర్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లగొండలో వ్యక్తి ఆత్మహత్య

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన కూన కొమురయ్య(49) ఆదివారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య తెలిపారు. వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి విషం తాగి మృతి చెందటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారందించారు. మృతునికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన స్థలం వద్ద విషం డబ్బ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కారణాలు తెలియరాలేదు.

రేపు గోపులింగారెడ్డి సాహిత్య సమాలోచనం

కరీంనగర్ కల్చరల్: ఎస్సారార్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో తెలుగు భాషాదినోత్సవ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎస్సారార్ కళాశాలలో డాక్టర్ గోపు లింగారెడ్డి సాహిత్య సమాలోచనం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్లు మాడిశెట్టి గోపాల్, కేఎస్ అనంతాచార్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, వక్తలుగా డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ మచ్చ హరిదాసు, వారాల ఆనంద్ హాజరవుతారని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

30న ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ కరాటే జిల్లా స్థాయి ఎంపిక పోటీలనుఈనెల 30న నిర్వహించనున్నామని జిల్లా కరాటే అసోసియేషన్ కార్యదర్శి గౌరు రాజిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 11 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఈ పోటీలకు ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం చదివే కరాటే విద్యార్థులు తమ ఎలిజిబిలిటీ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

అనాథ వృద్ధులకు దుస్తులు, నిత్యావసర వస్తువుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న క్లబ్ బాధ్యులు

సుభాష్‌నగర్: కాళేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్ఖానగడ్డలోని అనాథ వృద్ధులు, వికలాంగుల ఆశ్రమంలోని వృద్ధులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు.క్లబ్ అధ్యక్షురాలు మునిపల్లి ఫణీత మాట్లాడుతూ క్లబ్ సభ్యురాలు మెతుకు మంజుల జన్మదినాన్ని వృద్ధుల మధ్య జరుపుకున్నారని తెలిపారు. అమె జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమె చేతుల మీదుగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎర్రవెల్లి రజిత, కోశాధికారి బూర్ల రాధ, ఉపాధ్యక్షురాలు ఆవునూరి ఉమ, పత్తెం రమలు పాల్గొన్నారు.

మార్వాడి మందిర్ వినాయకునికి వినూత్న అలంకరణ


బెలూన్లతో అలంకరించిన మండపం

కరీంనగర్ కల్చరల్: స్థానిక మార్వాడి మందిర్‌లో రాజస్థానీ మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర మండపాన్ని ఆదివారం పూర్తిగా బెలూన్లతో అలంకరించారు. ప్రత్యేక అలంకరణ మధ్య ఉన్న వినాయకున్ని చూసి అందరూ మురిసిపోయారు. భక్తితో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచ్ అధ్యక్షుడు లడ్డు ముందడ, ఉపాధ్యక్షుడు సుశీల్ తాపిడియా, రాజేశ్ అసావా, కిరణ్, అర్జున్ కార్వా, చింటు ముందడ పాల్గొన్నారు.

గణపతికి విశేష పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కరీంనగర్ కల్చరల్: స్థానిక రాంనగర్‌లోని 41వ డివిజన్‌లో గల రమా సహిత సత్యనారాయణ స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో నెలకొల్పిన వినాయకుని వద్ద ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. రోజువారి సాంస్కృతిక వేదికపై కళాకారులు గంధం నరేశ్ మిమిక్రీ, యతిరాజ్ మ్యాజిక్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాకారులను టీఆర్ఎస్ నాయకుడు చల్ల హరిశంకర్ సన్మానించారు.ఈకార్యక్రమంలో కార్పొరేటర్ చల్ల స్వరూపారాణి, ఆలయ కమిటీ బాధ్యులు ఎంరాజేందర్, ఎకిరణ్‌కుమార్, హరికృష్ణ, సుగుణాకర్, శేఖర్, మురళీగౌడ్, చంద్రయ్య, సత్యనారాయణ, పాల్గొన్నారు.

నగరమంతా... గుంతలమయం

నగరంలోని రోడ్లన్నీ గుంతలతో అధ్వానంగా ఉన్నాయి. దుమ్ము,దూళితో వాహన చోదకులకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నగర రహదారులు నరక కూపంగా తయారయ్యాయి. వీటిపై ఫొటో ఫీచర్
- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్


తెలంగాణ చౌక్‌లో ప్రమాదకరంగా ఏర్పడిన గొయ్యి


వన్‌టౌన్ ఎదురుగా పెట్రోల్ పంపు ముందు ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా గుంతలు


సర్కస్ గ్రౌండ్ బస్టాప్ ఎదుట తెగిన ప్రమాదకరంగా రోడ్డు


జ్యోతినగర్ కెమిస్ట్రీ భవన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గొయ్యి


జ్యోతినగర్ కెమిస్ట్రి భవన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై తారు తేలి గుంతలమయంగా మారిన వైనం

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సుభాష్‌నగర్: నగరంలోని రెనె హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ లంక రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈశిబిరంలో పేషెంట్లకు ఆర్‌బీఎస్, హెచ్‌బీ, బీపీ, ఎక్స్‌రే, ఎంఎస్‌టి వంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేసి వైద్యపరమైన సలహాలు, సూచనలు అందజేశారు. ఆదర్శనగర్, సుభాష్‌నగర్, శర్మనగర్, వావిలాలపల్లికి చెందిన స్థానిక ప్రజలు వైద్య సేవలు పొందారు. వైద్యశిబిరంలో హాస్పిటల్ చైర్మన్, ప్రముఖ కీళ్ల, వెన్నుముక శస్త్ర చికిత్స వైద్య నిపుణుడు డాక్టర్ బంగారి స్వామి, సంతాన సాఫల్య, స్త్రీల వ్యాధుల నిపుణురాలు డాక్టర్ బంగారి రజనీప్రియదర్శిని, డాక్టర్ ఆర్ శశికాంత్, డాక్టర్ జి చైతన్య కిశోర్, డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజ్, డాక్టర్ ఎన్‌మోహన్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఎస్ రవికుమార్, డాక్టర్ మునిష్‌బాబు, డాక్టర్ ఆర్‌మహేశ్‌రావు, పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బంగారి స్వామి

విఘ్నేశ్వరుడి సన్నిధిలో సాంస్కృతిక ప్రదర్శనలు


తిలకిస్తున్న స్థానికులు, శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థిని

కరీంనగర్ కల్చరల్: స్థానిక భగత్‌నగర్‌లోని 31వ డివిజన్‌లో భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలునిర్వహించారు. ఆదివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో మంత్రముగ్ధుల్నిచేశారు. వారిని కార్పొరేటర్ సునీల్‌రావు అభి నందించి సత్కరించారు. ఈకార్యక్రమంలో మరో కార్పొరేటర్ అపర్ణ, అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ అలంకరణలతో గణపతులు

కరీంనగర్ కల్చరల్: విఘ్నేశ్వర నవరాత్రుల్లో భాగంగా నగరంలోని ప్రధాన ప్రాంతాలు, కూడళ్లను నగర పాలక సంస్థవారు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇందులో భాగంగా బస్టాండ్, తెలంగాణ చౌక్‌తోపాటు పలుకూడళ్లలో విద్యుద్దీపాలంకరణలతో వివిధరంగుల్లో దర్శనమిచ్చే బల్బులతో గణపతి ఆకృతులను ఏర్పాటు చేశారు. జనం వాటివంక ఆసక్తిగా చూస్తూ తన్మయత్వం చెందుతున్నారు.



బస్టాండ్ కూడలి వద్ద గణేశుని ఆకృతి


తెలంగాణ చౌక్ వద్ద కాంతులీనుతున్న విఘ్నేశ్వరుడు

నేత్రదానం

సుభాష్‌నగర్: గంగాధర మండలంలోని కురిక్యాల గ్రామానికి చెందిన దొంతరవేణి రాజ్‌కుమార్(34) మరణించాడు. అతని కోరిక మేరకు నేత్రదానం గురించి అతని కుటుంబ సభ్యులు వాసుదేవ లయన్స్‌క్లబ్ సభ్యులను సంప్రదించారు. వారు వెంటనే స్పందించి ఆయన నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి తరలించారు. ఈకార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ కోల అన్నారెడ్డి, ఉపగవర్నర్ ఈద కుమారస్వామి, రీజియన్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, సిద్దుల బాలకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు గోపు కుమార్, కార్యదర్శి సాగర్ రెడ్డి, కోశాధికారి లలితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారమితలో కవితల పోటీ

కరీంనగర్ కల్చరల్:తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంకమ్మతోట పొన్నం కాంప్లెక్స్ పారమిత పాఠశాలలో మంగళవారం కవితల పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల కన్వీనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన 8,9,10వ తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 9703119944 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎస్ఐవో ఆధ్వర్యంలో మానవహారం



డిగ్నిటీ మార్చ్‌ను నిర్వహిస్తున్న ఎస్ఐవో కార్యకర్తలు

గణేశ్‌నగర్: స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఐవో) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తెలంగాణ చౌక్‌లో భారీ మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షులు షోయెబ్ లతీఫీ మాట్లాడుతూ భారతదేశం విలువలతో కూడిన దేశమన్నారు. ఈకార్యక్రమంలో పౌర సంబంధాల కార్యదర్శి అక్రం సిద్ధిఖీ, రీజనల్ అధ్యక్షుడు ఉమేర్, కన్వీనర్ జవాద్, అయాజ్, మాజీద్, తౌరిఖ్, పాల్గొన్నారు.

రూపు మారనున్న కూరగాయల మార్కెట్

● 30న రైతు బజార్‌కు శంకుస్థాపన చేయనున్న మంత్రి


రైతు బజార్ నిర్మించే కూరగాయల మార్కెట్

హుజూరాబాద్ టౌన్: ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న రైతు బజార్ కల సాకారం కాబోతున్నది. ఈ నెల 30న కూరగాయల మార్కెట్‌లో అత్యాధునికమైన రైతు బజార్ నిర్మాణం కోసం మంత్రి ఈటల రాజేందర్ శంకుస్థాపన చేయనున్నారు. దీంతో కూరగాయల మార్కెట్ రూపుమారనుంది. హుజూరాబాద్ పాత వాడలో కూరగాయల మార్కెట్ అసౌకర్యాల నడుమ కొనసాగుతోంది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ దుర్వాసన నడుమ వ్యాపారులు, రైతులు వ్యాపారం చేస్తున్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ కేంద్రం కావడమే కాకుండా వ్యాపార, విద్యా, బ్యాంకింగ్ రంగాలలో అభివృద్ధి చెందుతోంది. దీంతో పట్టణంలో జనాభా అధికంగా ఉండటంతో కూరగాయలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. చుట్టు పక్కల గ్రామాల రైతులు, పట్టణ రైతులు తాము పండించిన కూరగాయలను ఈ మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయాలు చేపడుతారు. మరోవైపు కూరగాయల వ్యాపారులు కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి కూరగాయలను తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తుంటారు. అలాంటి మార్కెట్‌లో కనీసం తాగడానికి నీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకుండా ఇబ్బందులు పడేవారు. ప్రజలు అసౌకర్యాల నడుమనే కూరగాయలను కొనుగోలు చేసేవారు. వీటికి తోడు వరాహాలు సంచరించేవి. ఈ సమస్యలను పరిష్కరించాలని ఎన్నోసార్లు వ్యాపారులు, రైతులు, వినియోగదారులు మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఈటల రాజేందర్‌కు విన్నవించారు. దీనికి స్పందించిన మంత్రి ఈటెల వ్యవసాయ మార్కెట్ డిపార్ట్‌మెంట్ నుంచి హుజూరాబాద్‌లో రైతు బజార్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. ఈ మేరకు హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ నుంచి రూ.1.26కోట్లతో అత్యాధునికమైన రైతు బజార్‌ను నిర్మించనున్నారు. ఇందులో రైతులు తాము పండించిన కూరగాయలను అలాగే వ్యాపారులు విక్రయించేందుకు, ప్రజలకు సౌకర్యాలను కల్పించనున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, గదులు వంటి వసతులను ఏర్పాటు చేయనున్నారు.

● 30న రైతు బజార్‌కు శంకుస్థాపన

ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, హుజూరాబాద్



హుజూరాబాద్ కూరగాయల మార్కెట్‌లో ఈనెల 30న మంత్రి ఈటల రాజేందర్ ఆధునికమైన రైతు బజార్‌ను నిర్మించేందుకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.1.26కోట్లతో సిద్ధిపేట తరహాలో రైతు బజార్‌ను మంత్రి ఈటల రాజేందర్ నిర్మించడానికి కృషి చేశారు.

దీంతో ఈ ప్రాంత రైతులు, పట్టణ ప్రజలు, వ్యాపారుల సమస్యలు తీరనున్నాయి.

ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

జమ్మికుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి శంకర్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సంస్థగతంగా సభ్యులకు రాజకీయ అవగాహన పెంపొందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తోందన్నారు. పాలక ప్రభుత్వాల విధానాలను సీపీఎం పార్టీ సభ్యులు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, మురళీ, కుమార్, వైకుంఠం, రాజు, కుమార్, రాజకుమారి పాల్గొన్నారు.

మంత్రి, కెప్టెన్‌లకు శ్మశాన వాటిక ప్రారంభోత్సవ ఆహ్వానం అందజేత


మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చైర్మన్

హుజూరాబాద్: ఈనెల 30న హిందూ శ్మశానవాటిక ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్, రాజ్యసభ్య సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావులకు రావాలని ఆహ్వానించినట్లు హుజూరాబాద్ నగర పంచాయతీ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆదివారం హైద్రాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆహ్వాన పత్రికను వారికి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట నాయకులు రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనుమల్ల గణపతి


సమావేశంలో మాట్లాడుతున్న గణపతి

వీణవంక: గ్రామంలోని బూత్ స్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనుమల్ల గణపతి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను సమావేశంలో తీర్మానించారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినాన్ని అధికారంగా జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. గ్రామసభల తీర్మానం లేకుండానే పలు గ్రామాల్లో డబుల్ బెడ్ రూం లబ్దిదారులను ఎంపిక చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ మోర్చా అధ్యక్షుడు పీఎస్ నర్సింహరాజు, మండలాధ్యక్షుడు బత్తిని నరేశ్‌గౌడ్, నాయకులు సదానందగౌడ్, రామిడి యాదిరెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, ముత్యాల రవీందర్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, రాజు, సాయికుమార్, రాజేందర్, కొండా ల్, రమణారెడ్డి, దీపక్, రంజిత్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ధర్నా

జమ్మికుంట రూరల్: పోతిరెడ్డిపేట నుంచి పెద్దంపల్లి గ్రామం వరకు ఆరు నెలల క్రితం వేసిన తారు రోడ్డు ప్రస్తుతం ఎందుకు పనికి రాకుండా గుంతల మయంగా మారిందని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు ఆదివారం ధర్నాకు దిగారు. అనంతరం జిల్లా కారదర్శి ఎరబెల్లి సంపత్‌రావు మాట్లాడుతూ ఇటీవల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన బీటి, సీసీ రోడ్లు మొత్తం నాణ్యత లోపించి ఎందుకు పనికి రాకుండా పోయాయని విమర్శించారు. పోతిరెడ్డిపేట, పెద్దంపల్లి తారు రోడ్డును వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రమేష్, మల్లేష్, మోహన్‌రెడ్డి, రమేష్, రవీందర్, తిరుపతి, సదన్‌రెడ్డి, రవి, రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పవర్ డిప్లమా ఇంజనీర్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడి ఎన్నిక

హుజూరాబాద్: పవర్ డిప్లమా ఇంజనీర్ అసోసియేషన్ హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా మాటూరి వీరాచారి, ట్రెజరర్‌గా ఆర్ సత్యనారాయణలు ఎన్నికయ్యారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఎన్నికలలో వీరిని ఎన్నుకున్నారు.

వీరాచారి ఎల్కతుర్తి ఏఈ, సత్యనారాయణ జమ్మికుంట టౌన్ ఏఈగా పని చేస్తున్నారు.

హుజూరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

హుజూరాబాద్ టౌన్: హుజూరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సొల్లు బాబు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ మండలం, పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మనుగడపై నాయకత్వ లోపంపై టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి వివరిస్తామన్నారు. జిల్లాకు చెందిన ముఖ్య నాయకుడు ఒక కులానికి ప్రతినిధిగా వ్యవహరిస్తూ ఇతర బీసీ, దళిత కార్యకర్తలను పార్టీలో ఎదగకుండా చూస్తున్నారన్నారు. తన కులం వారికే పార్టీ పదవులను కట్టపెడుతూ సీనియర్ కార్యకర్తలను విస్మరిస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడిగా తననే నియమిస్తున్నారని హుజూరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తనకు వస్తుందని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఆలేటి సుశీల, సొల్లు దశరథం, ఆలేటి శ్రీనివాస్, అప్పాల రఘుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ మండల అధ్యక్షుడు మల్లికార్జున్

జమ్మికుంట: జమ్మికుంట మండల ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు నీలగిరి హనుమంతరావు, మల్లేషం, కిషన్‌రెడ్డి, జలేందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఫర్టిలైజర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడిగా బుర్ర మల్లిఖార్జున్, ప్రధానకార్యదర్శిగా గజవెల్లి మధుసూదన్, కోశాధికారి చిదురాల భాస్కర్, ఉపాధ్యక్షులుగా చిదురాల విజేందర్, దోమకుంట్ల రవి, ఎర్రబెల్లి సంపత్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా నాతాడి బుచ్చిరెడ్డిలు ఎన్నికయ్యారు.



పుట్టిన బిడ్డకు ముర్రుపాలు శ్రేష్టం

● శిశువులకు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది

హుజూరాబాద్ : పుట్టిన బిడ్డకు తల్లి నుంచి ముర్రుపాలు శిశువుకు అందజేస్తే శ్రేష్టంగా మారుతుంది. ఒక చుక్క ముర్రుపాలు జీవితాంతం రోగ నిరోదక శక్తిని అందజేస్తుందని హుజూరాబాద్ డిప్యూటీ డిఎంహెచ్‌వో రాజమౌళి తెలిపారు. తల్లిపాలు శిశువుకు ఆరు నెలల వరకు సంపూర్ణ ఆహారం. ప్రతి సంవత్సరం తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు బిడ్డ కు కావాల్సిన అన్ని పోషకాపదార్థలు, వ్యాధి నిరోదక శక్తి తల్లిద్వారా లభిస్తుందన్నారు.

ప్రాణాంతకమైన జబ్బుల నుంచి వివిధ దీర్ఘకాలిక జబ్బుల నుంచి పిల్లలకు తల్లి పాల ద్వారా అందుతుందన్నారు. పుట్టిన గంటలోపే తల్లి పాలు శిశువుకు అందిస్తే 22 శాతం శిశు మరణాలు నివారించవచ్చునని ఒక పరిశోధనలోని రూపించబడినట్లు ఆయన తెలిపారు. అలాగే ఆరు నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే శిశువుకు అందిస్తే 15 శాతం మరణాలు నివారించవచ్చునని పలు పరిశోధనల్లో తేలిందన్నారు.

● పుట్టిన బిడ్డకు పాలివ్వాలి

రాజమౌళి, డిప్యూటీ డిఎంహెచ్‌వో, హుజూరాబాద్



కొంత మంది తల్లులు నిర్లక్ష్యంతో పుట్టిన పిల్లలకు ముర్రుపాలు ఇవ్వారు. దీంతో భవిష్యత్తులో రోగనిరోధక శక్తి తగ్గుతుంది. పుట్టిన వెంటనే తల్లి నుంచి వచ్చే పాలను శిశువుకు అందజేస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తల్లి నుంచి బిడ్డకు తల్లి పాలతో పోషక విలువలు పెరుగుతాయి.

'నిరుపేదల రెడ్లను ప్రభుత్వం ఆదుకోవాలి'


మాట్లాడుతున్న పోరెడ్డి శంతన్‌రెడ్డి

సైదాపూర్: రెడ్డిలలో కూడా నిరుపేదలు ఉన్నారని వారిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి శంతన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రామలపల్లె గ్రామంలో జరిగిన రెడ్డి కుల బాంధవుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి కులస్థుల్లో నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు జరుగుతున్న రెడ్డి ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రెడ్డి కుల ఐక్యత కోసం వేదికలకు సహకరించాలని న్యాయమైన హక్కుల సాధన కోసం జరిగే కార్యక్రమాలలో అందరూ పాల్గొనాలన్నారు. సమాజంలో మిగతా వర్గాలకు అందిస్తున్న మాదిరిగా రెడ్డి కుల బాంధవులకు పథకాలను వర్తింపజేయాలన్నారు. కొందరు రాజకీయ లబ్ది కోసం రెడ్డి సమాజాన్ని విమర్శిస్తున్నారని అటువంటి నేతలకు తగిన సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలోని మెనిఫెస్టోలో రెడ్డిల గూర్చి ప్రస్తావించేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. రూ. 10వేల కోట్ల రెడ్డి కార్పోరేషన్ తక్షణమే ఏర్పాటు చేసి రెడ్డి యువతను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు దొనకొండ సురేందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు కందుల శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గంగారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు ఉద్యమానికి ఎస్‌జీటీయూ మద్దతు

కరీంనగర్ టౌన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని కోరుతూ చేస్తున్న ఉద్యమానికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం సంపూర్ణ మద్దతు నిస్తుందని ఆ సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యులు మధుసూధన్‌రావు, కె.మహిపాల్ రెడ్డి, సిహెచ్.మాధవ్, ఇ.పోచయ్య, గాయత్రి, మంజుల ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 1నకలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నా కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులంతా సామూహిక సెలవుపెట్టి పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

సమస్యల వలయంలో గాయత్రీనగర్

- నివాసాల చెంతనే మురికినీటి కుంటలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో స్థానికులు


వీధిలోని మట్టిరోడ్లు


నివాసాల చెంతనే మురికినీరు


వీధి రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

ప్రాబ్లం జోన్

టవర్‌సర్కిల్: నగరంలోని గాయత్రీనగర్‌లో సమస్యలతో స్థానికులు సతమతమవుతున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అనేక ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని స్థానికులు వాపోతున్నారు. వీధిలో అన్ని మట్టిరోడ్లు. దీంతో వర్షం కురిస్తే రోడ్డంతా బురదమయంగా మారుతోంది. ఆదారిపై నడిచి వెళ్ళలేని దుస్థితి నెలకొంటోంది. అలాగే వీధిలో డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో మురికినీరు బయటికి వెళ్లలేక నివాసాల చెంతనే నిలుస్తోంది. దీంతో వీధిలో మురికినీటికుంటలు కానవస్తున్నాయి. వీధివాసులు దుర్వాసనతోచాలా ఇక్కట్లకు గురవుతున్నారు. ఈకుంటలలో దోమలు చేరడంతో వాటిన బారినపడి పలు వ్యా ధులు గురవు తున్నామని స్థానికులు వాపోతున్నారు. దోమల నివారణ చర్యలు చెపట్టడం లేదని పలువురు పేర్కోంటున్నారు.. వీధుల్లో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బంధులు ఎదురవుతున్నాయి. పందులు సంచారం ఎక్కువగా ఉంది. డ్రైనేజీల్లోని సిల్ట్ సరిగా తీయటం లేదు. దీంతో మురికినీరు నిలుస్తోంది. వీధిలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి చె ట్లు ఎపుగా పెరిగిపోయి పాములు, క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారాయి. రాత్రి వేళ్లల్లో, వర్షం కురిస్తే పాములు వీధిలోకి వస్తున్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. వీధిదీపాలు సరిగా వెలుగడం లేదని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వీధివాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని గాయత్రినగర్ వాసులు కోరుతున్నారు.

రోడ్లు వేయాలి...



●నాంపల్లిశారద(స్థానికురాలు)

వీధిలోని రోడ్లు అధ్వాన్నంగా మారాయి. మట్టిరోడ్లు కావటంతో ఎగుడుదిగుడు రోడ్లతో వర్షం కురిస్తే బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది.దోమలతో పలు వ్యాధులు ప్రబలుతున్నాయి. దోమల నివారణ చర్యలు చేపట్టాలి. వీధుల్లోని పిచ్చి చెట్లను తొలగించాలి. పిచ్చి చెట్ల వల్ల పాములు వస్తున్నాయి.

డ్రైనేజీలు నిర్మించాలి...



● మౌలానా బీ (స్థానికురాలు)

వీధుల్లో డ్రైనేజీలు లేక మురికినీరు నివాసాల చెంతనే నిలుస్తోంది. దీంతో దుర్వాసనతో ఇండ్లలో ఉండ లేకపోతున్నాం. డ్రైనేజీలు నిర్మించి మురికినీరు నిలువకుండా చూడాలి. దుర్గంధం వెదజల్లున్నందున, పందులను తరలించాలి. వీధి మధ్యలోని స్తంభాలను తోలగించాలి.

గణేశుడికి సీపీ పూజలు


గణేశునికి పూజలు చేస్తున్న సీపీ వీబీ కమలాసన్ రెడ్డి

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని కాపువాడ, మంగళివాడలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను సందర్శించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ వీబీ కమలాసన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీపీ వెంట కరీంనగర్ ఒకటవ ఠాణా సీఐ తుల శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ అధ్యాపకుల
బతుకులు మారాలి

సుభాష్‌నగర్: రాష్ట్ర సాధన లక్ష్యంగా తెలంగాణ ఉద్యమ, తొలి, మలిదశ పోరాటంలో కీలక భూమిక పోషించిన ప్రైవేట్ అధ్యాపకుల బతుకులు మారాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాసం రత్నాకర్ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ అధ్యాపకుల పరిస్థితి అత్యంత దయనీయంగామారిందని యాజమాన్యాలు మానవతా ధృక్పథంతో ఉద్యోగ భద్రత, సరైన వేతనం కల్పించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోకల నాగయ్య మాట్లాడుతూ యాజమాన్యాలు నైపుణ్యానికి తగిన వేతనాలు చెల్లించాలని, పీఎఫ్‌తోపాటు 12 నెలల వేతన ప్రక్రియ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గిన్నెల రాంకిషన్, ప్రచార కార్యదర్శి సత్యనారాయణరాజు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చిక్కుడు మహేశ్, నాయకులు శ్రీనివాస్, సదానందాచారి, తదితరులు పాల్గొన్నారు.

సమన్యాయం కోసం సంఘటిత పోరాటం

- తెలుగు రాష్ట్రాల ఓసీ సంక్షేమ సంఘాల ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఇన్‌చార్జి పోలాడి రామారావు

సుభాష్‌నగర్: కుల, మత, వర్గ బేధం లేకుండా పేదలందరికీ సమన్యాం జరిగేంతవరకు సంఘటితంగా పోరాడుతామని తెలుగు రాష్ట్రాల ఓసీ సంక్షేమ సంఘాల ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఇంచార్జి పోలాడి రామారావు అన్నారు. ఆదివారం నగరంలోని ఓసీ సంక్షేమ సంఘాల ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక స్థితిగతుల ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయకపోవడం వల్ల విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ రంగాల్లో ఓసీ పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీ పేదలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఓసీల స్థితిగతుల అధ్యయనానికి చట్టబద్ధతతో కూడిన కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వెయ్యికోట్ల రూపాయల నిధులతో ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా నిధులు కేటాయించి స్వయం ఉపాధి పథకాల కోసం 80 శాతం రాయతీతో రుణాలు అందించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేసి స్కాలర్‌షిప్‌లు అందించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వుట్కూరి రాధాకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరి స్వామిరెడ్డి, నాయకులు దేవ సతీష్ రెడ్డి, జనగామ తిరుపతిరావు, దీపక్ బాబు, సమ్మిరెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సింగారెడ్డి, వంశీధర్ రెడ్డి, పోలాడి హన్మంతరావు, రత్నాకర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొబ్బరి మొక్కల పంపిణీ


మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ భాగ్యలక్ష్మి ఆనందరావు

కరీంనగర్ రూరల్: మూడో విడత హరిత హారంలో భాగంగా ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామస్థులకు ఉచితంగా ప్రతిఇంటికి ఒక కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. మొగ్దుంపూర్ గ్రామంలో సర్పంచ్ తాళ్లపల్లి లక్ష్మిశ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో 1008 కొబ్బరి మొక్కలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సురేష్, లచ్చిరెడ్డి, శాంతమ్మ, దేవయ్య, లచ్చయ్య, రఘురాం, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● చేగుర్తి గ్రామంలో సర్పంచ్ బల్మూరి భాగ్యలక్ష్మి ఆనందరావు గ్రామస్తులకు ఇంటికొక కొబ్బరి మొక్కతోపాటు 10 టేకు మొక్కలను అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరుణ, ఎంపీ టీసీ సరోజన, రాజయ్య, మల్లేశం, సంపత్, పాల్గొన్నారు.

● ఇరుకుల్ల గ్రామంలో సర్పంచ్ జువ్వాడి మారురావు గ్రామస్తులకు కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్, కాశిపాక రమేశ్, పోచయ్య, మల్లేశం, పర్శరాం, పాల్గొన్నారు.

● జూబ్లీనగర్, చామనపెల్లి, చెర్లబుత్కూర్, ఫకీర్‌పేట్, బహదూర్‌ఖాన్‌పేట, నగునూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహడ్, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్, నల్లకుంటపల్లి గ్రామాల్లో సర్పంచులు గ్రామస్తులకు ఒక కొబ్బరి మొక్కతోపాటు టేకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు స్వామి, మల్లయ్య, మునిరాజ్, మల్లయ్య, లక్ష్మి, లలిత శ్రీనివాస్, గ్రామస్థులు, మహిళలు, పాల్గొన్నారు.

గణేశ్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న గణేశ్ యూత్ సభ్యులు

కరీంనగర్ రూరల్: మండలంలోని దుర్శేడ్ గ్రామంలోని గణేశ్‌యూత్ ఆధ్వర్యంలో నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆది వారం గ్రామంలోని హనుమాన్‌గుడిలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ లక్ష్మితిరుపతి, బోగ కృష్ణమూర్తి, ఓంప్రకాశ్, శ్రీనివాస్, లింగమూర్తి, చంద్రమౌళి, నరేష్, పురుషోత్తం, సంతోష్, లక్ష్మినారాయణ, రాము, గోవర్ధన్, పాల్గొన్నారు.

బొమ్మకల్‌లో...

మండలంలోని బొమ్మకల్ గ్రామంలోని అంజన్ననగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో భూమేశ్, కపిల్, తిరుపతి, సుమన్, అంజిబాబు, మధు, శంకర్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని వద్ద విశేష హోమం


గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్: స్థానిక ముకరంపురలోని మైత్రి హోటల్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపం వద్ద ఆదివారం జ్యోతిష,వాస్తు పండితుడు ఆచార్య కాండూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. అంతకు ముందు బుత్వికుల మంత్రోచ్ఛారణల మధ్య మట్టిగణపతికి ఫలరస పంచామృతాభిషేకం, అర్చన, విశేషాలంకారం చేశారు. గణపతి అధర్వణ శీర్షోపనిషత్, పంచసూక్తాలతో విశేష హోమం, పూర్ణాహుతి జరిపారు.అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో వేదపండితులు గుండారం సంతోష్‌కుమార్‌శర్మ, గంగవరం నాగేశ్వరశర్మ, రుద్రంభట్ల శ్రీనివాసశర్మ, రవిశర్మతోపాటు మైత్రి హోటల్ యాజమాన్యం, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేనున్నాను
సేవా సమితి నాలుగో వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్: నేనున్నాను సేవా సమితి నాల్గవ వార్షికోత్సవంసందర్భంగా ముకరంపురలోని నియోహెల్పింగ్ హ్యాండ్స్ అనాథాశ్రమంలో ఆదివారం సమితి సభ్యులు చిన్నారులతో వేడుక నిర్వహించారు. చిన్నారులకు నోట్‌బుక్స్, పెన్నులు, పండ్లు పంచారు. మూడు సంవత్సరాలుగా సమితి ఆధ్వర్యం లో స్వచ్ఛ భారత్, హరితహారం, సేవా కార్యక్రమాలు నిర్వహించామని సమాజసేవ బాధ్యతగా ఇలానే ముందుకు సాగుతామని, అనాథ పిల్లలను ఆశ్రమంలో చేర్పించి వారి భవితకు తోడుంటామని సభ్యులు తెలిపారు. అలాగే తీగలగుట్టపల్లిలోని ఆదరణ ఫ్యామిలీ ఆశ్రమంలో కూడా నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు వి శ్రావణ్, డి రవి, కె నరేష్ చైతన్య, పి అభిషేక్, కే దేవరాజ్, జి నరేష్‌లు పాల్గొన్నారు.

వినాయకుడి సన్నిధిలో పడిపూజ

కరీంనగర్ కల్చరల్: హరిహర ఆనంద అ య్యప్ప ఆశ్రమం సభ్యుల బృందం ఆధ్వర్యంలో అశోక్‌నగర్ వినాయకుని సన్నిధిలో ఆదివారం పడిపూజ నిర్వహించారు. అభిషేక, అర్చనలు, భజనలు చేస్తూ ఆధ్యాత్మిక భావంతో పరవశించిపోయారు. పాలకుర్తి శ్రీనివాస్, గుండ రాధాకిషన్, ఆడెపు కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాశెట్టి రామన్న, కొమురవెల్లి మహేశ్, గంప శ్రీను, భూపతి రమేశ్, అశోక్, హరీశ్, సురే శ్, తదితరులు పాల్గొన్నారు.

అరణ్యాన్ని తలపిస్తున్న ఎల్ఎండీ కాలనీ

● అంతంత మాత్రంగా కరెంట్, మంచినీటి సౌకర్యం ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు




క్వార్టర్ల వద్ద, కాలనీలోని రహదారిలో పెరిగిన పిచ్చి మొక్కలు

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ పారిశుధ్య లోపంతో అరణ్యాన్ని తలపిస్తోంది. ఇళ్లలోకి ఏ సమయంలో ఎలాంటి క్రిమి కీటకీలు వస్తాయోనని కాలనీవాసులు భయపడుతూ కాలం వెల్లదీస్తున్నారు. కాలనీలో నీటి పారుదలశాఖలో పని చేస్తున్న ఉద్యోగుల కోసం నిర్మించిన క్వార్టర్లు, రహదారుల వెంబడి చెట్లు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. రాత్రి పూట ఈ దారి గుండా కాలనీకి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో వీధి దీపాలు లేవు. ఉన్నవి వెలగవు. వర్షంపడితే చాలు కరెంట్ పోవడం ఖాయం. రాత్రి పూట పోయిన కరెంట్ మళ్లీ ఉదయం వరకు రాదు. కరెంట్ లేకుంటే నల్లాలు కూడా రావు. దీంతో మంచినీటి కోసం బకెట్లు, బిందెలు పట్టుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లాలి. లేంకుంటే పదిహేను రూపాయలకు ఒక మినరల్ వాటర్ క్యాన్ వేయించుకోవాలి. నీటి పారుదల శాఖకు సంబంధించి జిల్లా ముఖ్య కార్యాలయం, కాలనీకి సంబంధించిన క్యాంపు మెయింటనెన్స్ కార్యాలయం ఎల్ఎండీ కాలనీలోనే ఉన్నా కాలనీని పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. కాలనీలోని ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రుల చుట్టు పక్కల కూడా చెట్లు, పిచ్చి మెక్కలు పెరిగి భయంకరంగా ఉంది. ప్రతి సంవత్సరం క్వార్టర్లలో ఉన్న వాళ్లే సొంత డబ్బులతో తమ ఇం టి చుట్టుపక్కల శుభ్రం చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీని శుభ్ర పరిచి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

● కాలనీని శుభ్ర పరచాలి..

\- సౌభాగ్యమ్మ, కాలనీవాసి



కాలనీలో చెట్లు, పొదలు దట్టంగా పెరిగి అడవిని తలపిస్తోంది. కాలనీలో వీధి దీపాలు కూడా వెలగడం లేదు. రాత్రిళ్ల ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది. ఇంటి చుట్టూ దట్టంగా చెట్లు పెరగడంతో విష సర్పాలు, పురుగులు వస్తున్నాయి. అధికారులు స్పందించి కాలనీలో పెరిగిన చెట్లను తొలగించి వీధిదీపాలను ఏర్పాటు చేయాలి. మంచి నీటి వసతిని కూడా మెరుగుపర్చాలి.

వృత్తి విద్యలతో మహిళల ఆర్థికాభివృద్ధి

● ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: వృత్తి విద్యల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తెలిపారు. మానకొండూర్‌లో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధిని సాధించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే మహిళా సాధికారితకు సార్థకత ఉంటుందన్నారు. దక్షిణ భారతదేశంలో ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ, నిరుపేదలకు ఉచితవిద్య, యువకులకు డ్రైవింగ్, ఎలక్ట్రిషియన్, కంప్యూటర్ తదితర రంగాలలో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే అవకాశాన్ని గ్రామీణ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో నాలుగు సంవత్సరాలలో 27 యూనిట్లను సంస్థ ప్రారంభిస్తాననడం సంతోషదాయకమన్నారు. కుట్టు శిక్షణలో నైపుణ్యత సాధించిన వారికి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవ సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, ఉపసర్పంచ్ బొల్లం వెంకట్‌స్వామి, సంస్థ వ్యవస్థాపకులు బాలచందర్‌సుంకూ, సంస్థ కో-ఆర్డినేటర్ క్రిష్ణవేణి, ట్రష్టీ రంగారావు, జిల్లా కో-ఆర్డినేటర్లు ఆరెల్లి అరుణ, ఆరెల్లి ప్రభంజన్, మహిళలు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో అన్నదానం



కరీంపేటలో అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్, కరీంపేట గ్రామాల్లోని వినాయక మం డపాల వద్ద ప్ర జా ప్రతినిధులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు.

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి, మానకొండూర్ గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద అన్నదా నం చేశారు. గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా భక్త లు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మండపాల నిర్వాహకులు,భక్తులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద నిర్వాహకులు ఆదివారం అన్నదానం చేశారు. తిమ్మాపూర్, అల్గునూర్, మహాత్మానగర్ గ్రామాల్లో భక్తులు గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గన్నేరువరం: మండలంలోని అన్ని గ్రామాల్లో గణేశ్ మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చొక్కారావుపల్లి గ్రామంలో వినాయకుడి వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

శంకరపట్నం: కార్యకర్తలు పార్టీ పటిష్ట కోసం కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చౌడమల్లా వీరస్వామి పిలుపునిచ్చారు. కేశవపట్నంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆయన అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా మొలంగూరి సదానందం, కార్యదర్శిగా శంకర్, యూత్ అధ్యక్షుడిగా గొడిశాల ప్రవీణ్, కార్యదర్శిగా ఎండీ జాకీర్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడిగా పవన్, కార్యదర్శిగా తిరుపతి, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా కల్లెపెల్లి రాజయ్యను నియమించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా సరస్వతి యాగం, గణపతి, గాయత్రి యజ్ఞం

గన్నేరువరం: మండలకేంద్రంతో పాటు పారువెల్ల శ్రీ లక్ష్మిగణపతి దేవాలయంలో సరస్వతి యాగం, గణపతి, గాయత్రి యజ్ఞానాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.పారువెల్ల లక్ష్మీగణపతి దేవాలయంలో 108 మోదకాలతో గణపతి యజ్ఞం నిర్వహించారు. హైదరాబాద్, సిద్ధిపేట, కరీంనగర్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, నేదునూరి శంకరశాస్త్రి ఆర్య, పెద్ది విద్యాసాగర్, అలువాల కోటి, పీచు మల్లారెడ్డి, బలరాంరెడ్డి, లక్ష్మీరాజం, పోతు రాయమల్లు, బూర రామకృష్ణ, శ్రీనివాస్, మేకల మల్లయ్య, సత్యనారాయణ, పూసాల బ్రహ్మానందం, వెగ్గల నర్సింహాచారి, కొండగొర్ల నారాయణ, బూర వెంకటేశ్వర్లు, గర్షకుర్తి కిషన్, తదితరులు పాల్గొన్నారు.



గణపతి, సరస్వతి, గాయత్రీ యజ్ఞాలు చేస్తున్న భక్తులు

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● ఎస్సై ఎల్ శ్రీను



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్సై ఎల్ శ్రీను

శంకరపట్నం: వినాయక మండపాల వద్ద ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని స్థానిక ఎస్సై ఎల్ శ్రీను అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని పలు గ్రామాలలోని వినాయక మండపాలను సందర్శించారు. ఆయ న మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉత్సవాలను నిర్వహించుకోవాలని భక్తులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్‌కు సన్మానం

శంకరపట్నం: మాదిగ హక్కుల పరిరక్షణ సమితి సీనియర్ నాయకుడు ఆదివారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ ఓరుగంటి ఆనంద్‌ను ఘనంగా సన్మానించారు. కరీంనగర్‌లోని ఆయన ఇంటిలో సన్మానం నిర్వహించినట్లు పరిరక్షణ సమితి నాయకులు తెలిపారు. ఆనంద్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి సమైక్యాంధ్ర పార్టీలను ఎదురించారన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి నాయకులు నాగేశ్వర్‌రావు, రెడ్డిగాని రాజు, సముద్రాల సంపత్, రవి, మానకొండూర్ నియోజకవర్గం జేఏసీ ఇన్‌చార్జి కనుకం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఫుడ్ కమిషన్ మెంబర్ ఆనంద్‌ను సన్మానిస్తున్న నాయకులు

30న టీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశం

చిగురుమామిడి: ఈ నెల 30న హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో టీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో రైతు సంఘాలు ఏర్పాటు చేయడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పార్టీ మండల అధ్యక్షుడు రామోజుకృష్ణమాచారి కోరారు.

మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత

శంకరపట్నం: మండలకేంద్రానికి చెందిన కొత్తపెల్లి అరవింద్ మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం మక్తా గంగా కావేరి సీడ్ నిర్వాహణ కమిటీ బాధ్యులు సామాజిక ఉద్యమకారులు కర్క ప్రకాశ్‌రెడ్డి, గాజుల శ్రీనివాస్‌లు రూ.లక్ష చెక్కును అందజేశారు. అరవింద్ గత ఏడాది దీపావళి రోజున కేశవపట్నం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కార్యక్రమంలో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కమిటీ బాధ్యులు

సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్
జిల్లా ప్రధాన కార్యదర్శిగా సమ్మిరెడ్డి

శంకరపట్నం: మండలంలోని గద్దపాకకు చెందిన అల్గివెల్లి సమ్మిరెడ్డిని తెలంగాణ రంగస్థలం సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు అసోసియేషన్ జిల్లా బాధ్యులు నియమక పత్రాన్ని జారీ చేశారు. సమ్మిరెడ్డి సేవలకు గానూ ఈ పదవిని అప్పగించామని తెలిపారు. సహాయ కార్యదర్శిగా వీరెల్లి రాంచంద్రారెడ్డి, జిల్లా డైరెక్టర్‌గా మాడ రాజిరెడ్డిని నియమించినట్టు నియామక పత్రంలో వివరించారు.

'కాళేశ్వరం' పై ప్రజాభిప్రాయ సేకరణ డ్రామా

● దమ్ముంటే ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు రావాలి ● జడ్పీ సమావేశంలో మెడికల్ కళాశాలపై తీర్మాణం చేయాలి
● టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్ : కాళేశ్వరం ప్రాజెక్టు శంఖుస్థాపన చేసి 17 నెలలు గడిచిన తరువాత ప్రజాభిప్రాయ సేకరణ ఏ విధంగా చేస్తారని, ప్రజలను మభ్యపెట్టడానికి సీఎం కేసీఆర్ డ్రామా చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆయన ఆదివారం ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్యావరణ అనుమతులు లేకుండా భూసేకరణ, ప్రాజెక్టు పనులు ఏ విధంగా ప్రారంభించారని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేసి రెండేళ్లు గడుస్తున్నా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రెండేళ్లలో నీరందిస్తానని చెప్పిన కేసీఆర్ 2016 మే 1న శంఖుస్థాపన చేసి ఆగస్టు 24న మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నాడని, ఆగస్టు 26న మంత్రి హరీష్‌రావు అధికారులతో సమీక్ష జరిపి వచ్చే ఏడాది నీరిస్తామని చెప్పారని, ఇదంతా జరిగిన ఏడాదిన్నర తరువాత పర్యావరణ అనుమతులంటున్నారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమంటూ సీఎం, మంత్రి హరీష్‌రావులు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సారెస్పీ, ఎల్ఎండి, వరదకాలువ, ఎల్లంపల్లి సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే నిర్మించారనే విషయాన్ని మరిచిపోకూడదన్నారు. వరద కాలువలో మిగిలిపోయిన కొద్దిపాటి పనులను చేస్తూ విస్తృత ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మంత్రి హరీష్‌రావు అబద్దాల బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కాంగ్రెస్‌పార్టీపై అబద్దాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇరిగేషన్ శాఖకు కేటాయించిన నిధులు, చేసిన పనులు, టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడేళ్లలో చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2013 భూసేకరణ చట్టం అమలు చేయటంలేదని బాధిత రైతులు కోర్టుకు వెళితే కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. జీఎస్టీతో అన్యాయం జరుగుతుందని కోర్టుకు వెళతామని చెప్పిన కేసీఆర్ అదే విధంగా పరిహారం చెల్లింపులో తమకు అన్యాయం జరుగుతుందని కోర్టుకు వెళ్లిన రైతులను ఎలా తప్పుపడుతున్నారని అన్నారు. మేడిగడ్డ-తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు తగ్గించి తెలంగాణ ప్రజల పరువును మహారాష్ట్రకు తాకట్టు పెట్టిన టీఆర్ఎస్ ప్రభుత్వం సంబరాలు చేసుకుందని విమర్శించారు. కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కరీంనగర్ జెడ్పీ సమావేశంలో సభ్యులు తీర్మాణం చేయాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జడ్పీలో ఉన్న అన్ని రాజకీయ పక్షాల జడ్పీటీసీ, ఎంపీపీ, ఇతన సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమకు లేఖను పంపిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒక వేళ కరీంనగర్‌లో వైద్య కళాశాల అవసరంలేదనుకుంటే ఆ మేరకే తీర్మాణం చేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మేయర్ డి శంకర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల ప్రకాశ్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు దిండిగాల మధు, మాజీ కార్పొరేటర్‌లు చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిశేఖర్, ఎలగందుల మునీందర్, పొన్నం సత్యనారాయణ, పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఈఎన్‌సీ అనిల్ కుమార్

తిమ్మాపూర్: మధ్యమానేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతం ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టుల ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ కరీంనగర్(ఈఎన్‌సీ) అనిల్ కుమార్ తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే రోజుల్లో భారీ వర్షాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 2.2 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.33 టీఎంసీ నీటి నిల్వ ఉందన్నారు. ఇన్‌ఫ్లో ప్రస్తుతం 1058 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో ప్రస్తుతం ఏమీ లేదన్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహక ప్రాంతాల నుంచి భారీగా ఎగువ మానేరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ఉన్నదన్నారు. దీని వల్ల ఎగువ మానేరు నిండిన వెంటనే మధ్య మానేరు రిజర్వాయరులోకి నీరు వచ్చే అవకాశముందన్నారు. కాబట్టి మిడ్ మానేరు కింది పరివాహన ప్రాంతాల్లోని ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

30, 31 తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి ఏకలవ్య కబడ్డీ క్రీడలు

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ ఎరుకల యువజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి ఏకలవ్య కబడ్డీ క్రడలను నిర్వహించనున్నామని ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని శాతవాహన ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఆదివారం జిల్లాస్థాయి ఎరుకల విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించారు. ఏకలవ్య కబడ్డీ క్రీడలను కేవలం ఎరుకల కులస్తుల కోసం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న కబడ్డీ జట్లు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. పోటీల్లో ప్రథమ స్థానానికి 20 వేలు షీల్డు, ద్వితీయ స్థానానికి 10 వేలు షీల్డు, తృతీయ స్థానానికి 5 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నామని తెలిపారు. సమావేశంలో విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు బిజిలి తిరుపతి, రాష్ట్రసహాయ కార్యదర్శులు ఉండాడి సాగర్, సమ్మలు, అంజనిప్రసాద్, మొగిలి సమ్మయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజేందర్, అంజయ్య, కనకయ్య, పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు వరద నీరు

● ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ● ప్రాజెక్ట్‌లోకి 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
●1 టీఎంసీ పెరిగిన నీటిమట్టం ● ఎస్సారెస్పీ నీటిమట్టం 27.738 టీఎంసీలు


శ్రీరాంసాగర్‌లో పెరిగిన నీటిమట్టం

ఆంధ్రజ్యోతి, జగిత్యాల : శ్రీరాంసాగర్‌కు మళ్లీ వరద నీరు వచ్చి చేరుతుంది. ఎగువ ప్రాంతాల్లో కు రుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్ట్‌లోకి ఆదివారం 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఒక్క రోజే ఒక టీఎంసీ నీటిమట్టం పెరిగింది. మహారాష్ట్ర ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల బాలెగావ్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో ఆదివారం ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చింది. ఆదివారం ఉదయం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 26.814 టీఎంసీ(1068.90 అడుగులు)లు ఉండగా, మధ్యాహ్నం 1 గంట వరకు 25,645 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. మూడు గంటల వరకు 26,375 క్యూసెక్కులకు పెరిగింది.

దీంతో ప్రాజెక్ట్‌లోకి ఈ ఒక్క రోజే ఒక్క టీఎంసీ నీరు వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు. శ్రీరాంసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 90.31 టీఎంసీ(1091 అడుగులు)లు కాగా, ఆదివారం సాయంత్రం నాటికి 27.738 టీఎంసీ(1069.40 అడుగులు)లకు చేరుకుంది. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్ట్ నీటిమట్టం 37.379 టీఎంసీ(1074 అడుగులు)లుగా ఉంది.

అవినీతి అధికారితో రాజీపడలేకే శ్రీకాంత్ ఆత్మహత్య

● మరణవాంగ్మూలం కూడా పట్టించుకోరా? ● సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

వెల్గటూర్: అవినీతి అధికారితో రాజీ పడలేకే దేవీ శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని సీఎల్పీ ఉపనేత, జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయితీ యువ ఇంజనీర్ దేవి శ్రీకాంత్ మృతికి కారణమైన వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఎండపెల్లిలో శ్రీకాంత్ కుటుంబీకులను జీవన్‌రెడ్డితో పాటు జడ్పీ మాజీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి పెరుగుతోందన్నారు. శ్రీకాంత్ మృతి ప్రభుత్వ అవినీతికి, ఉన్నతాధికారుల నియంతృత్వ ధోరణికి అద్దం పడుతోందన్నారు. నిర్మల్ డివిజన్ పంచాయితీరాజ్ ఈఈ రఘు వీరారెడ్డి వేధింపులకు తలొగ్గలేకనే యువ ఇంజనీర్ శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకో వడం దురదృష్టకరమన్నారు. ఈఈ రఘువీరారెడ్డి వేధింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకుంటున్నానని మరణ వాంగ్మూలం (సూసైడ్‌నోట్) రాసినా పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు అధికారిపై ఇప్పటి వరకు చర్యలు చేపట్టక పోవడం ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనం అని ఎద్దేవా వేశారు. ఈఈ రఘువీరారెడ్డి పరారీలో ఉన్నాడని అతనిని పట్టుకోడానికి రెండు స్పెషల్ పార్టీలు ఏర్పాటు చేశామని ఎస్పీ అనడం విడ్డూరంగా ఉందన్నారు. పంచాయితీరాజ్ శాఖ మంత్రి, ఇంజనీర్ ఇన్ చీఫ్ దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం శ్రీకాంత్ కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు అతడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శంకర్, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ చుక్క శంకర్‌రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, నాయకులు జితేంధర్ రెడ్డి, శ్రీను, సంజీవ్‌రెడ్డి, సతీష్, మురళి పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.


మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.


కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.


సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.


కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.


మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.


మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి

● సీపీ వీబీ కమలాసన్ రెడ్డి

కరీంనగర్ క్రైం: గణేశ్ నవరాత్రిఉత్సవాలు, బక్రీద్ వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వీబీ కమలాసన్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి కశ్మీర్‌గడ్డ ప్రాంతంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులనుద్దేశించి సీపీ మాట్లాడుతూ అన్నిమతాలవారు అన్ని పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. అన్ని మతాల విశ్వాసాలను అందరు గౌరవించాలని అన్నారు. వేడుకల సందర్భంగా విద్వేషాలను సృష్టించే ఆకతాయిలపట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సున్నితమైన అంశాలపై విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. యువతీ, యువకులు పోలీసుశాఖ ప్రవేశపెట్టిన హాక్ ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఎటువంటి ఫిర్యాదునైనా, సమాచారాన్నైనా పోలీసు ఠాణాలకు వెళ్లకుండానే హాక్‌ఐ ద్వారా పోలీసు అధికారులకు అందించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి విద్యార్థినులు, యువతులు, మహిళలు ఆపద సమయంలో ఈ యాప్ ద్వారా పోలీసులతోపాటు కుటుంబ సభ్యులకు నిమిషాలలో సమాచారాన్ని అందించే విధంగా ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. కరీంనగర్‌లోని ప్రతి ఒక పౌరుడు ఈ హాక్‌ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ తనిఖీలలో కరీంనగర్ రెండవ సీఐ మహేశ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి

సంఘటితంగా పోరాడాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

టవర్‌సర్కిల్: రాష్ట్రంలో అనేక సమస్యలతో సతమతమవుతున్నా రని, వాటి పరిష్కారం కోసం పాలకులు కృషి చేయడం లేదని, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం నగరంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల క్షేమం కోసం, వ్యవసారంగ సంక్షోభ నివారణ కోసం వేసిన డాక్టర్ స్వామినాథన్, ప్రొఫెసర్ జయతీఘోష్‌ల సిఫారసులను అమలు చేయకుండా రైతులకు ఏదో చేస్తున్నామనే భ్రమలు కల్పించడానికే ప్రచారం చేస్తుకుంటున్నారని అన్నారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా, ధరల స్థిరీకరణ కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయకుండా, ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోకుండా మాయమాటలతో కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. వ్యవసాయరంగంలో కార్పొరేట్ పెట్టుబడులు రాబోయేకాలంలో దేశీయ వ్యవసాయాన్ని, చిన్న, సన్నకారు రైతులను కబలించి వేస్తాయని అన్నారు. అటువంటి ప్రమాదం నుంచి రైతులను రక్షించాలంటే పోరాటాలే శరణ్యమని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అందెస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి పొనగంటి కేదారి, బండ రాజిరెడ్డి, జయపాల్‌రెడ్డి, సంపత్, జి సంజీవ్, కంది రవీందర్ రెడ్డి, కె బుచ్చన్న యాదవ్, పొన్నం కనకయ్య, మోరపల్లి తిరుపతి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

కరీంనగర్ క్రైం: శంకరపట్నం మండలం అరకండ్ల గ్రామానికి చెందిన నేదురు కనుకయ్య(60) అనే వృద్ధుడు పదిరోజుల క్రితం తప్పిపోయి కరీంనగర్ చేరుకోగా కరీంనగర్ ఒకటవ ఠాణా హెడ్‌కానిస్టేబుల్ రాజిరెడ్డి, కానిస్టేబుల్ రమణారెడ్డిలు ఆయనను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కరీంనగర్‌లోని కమాన్ చౌరస్తా వద్ద తప్పిపోయి తిరగాడుతున్న కనుకయ్యను ఆదివారం పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కరీంనగర్ చేరుకున్న కుటుంబ సభ్యులకు కనుకయ్యను అప్పగించారు.

'దళితులకు అందని సంక్షేమ ఫలాలు'

జగిత్యాల రూరల్: రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన దళితులకు సంక్షేమ ఫలాలు అందడంలేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల మండలం ధరూర్, జాబితాపూర్, ధర్మారంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని, ఎస్సీ నిధులను పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందించడం లేదని తెలిపారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పని చేయాలని, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వం గ్రామస్థాయిలో గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించడం లేదని, పూర్తిగా తెలంగాణ రాష్ట్ర వైఫల్యమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కింద మాత్రమే ఇప్పటి వరకు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మానసనరేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ మహేష్, సర్పంచులు జలజ దామోదర్‌రావు, లక్ష్మినర్సయ్య, మల్లేశం, ఉపసర్పంచ్ మారులక్ష్మిగంగారెడ్డి, ఎంపీటీసీలు సువర్ణ, సురేందర్, శ్రీరాముల గంగాధర్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు పాల్గొన్నారు.

17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని

అధికారికంగా నిర్వహించాలి

● 11న కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ టౌన్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న అధికారికంగా నిర్వహిస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ఎంఐఎంకు తొత్తుగా మారి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం సిగ్గు చేటని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ పదాధికారుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 11న నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పార్టీశ్రేణులు, తెలంగాణవాదులు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శక్తి కేంద్రాల సమావేశాలు నిర్వహించి బూత్‌స్థాయి కార్యకర్తలను ఉత్తేజితులను చేయా లని పిలుపునిచ్చారు.

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై స్పందించాలని, అవసరమైతే మండలాల్లో ధర్నా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సెప్టెంబర్ 17న కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిజామాబాద్‌లో జరిగే బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు.

ఈసమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొరివి వేణుగోపాల్, కన్నబోయిన ఓదేలు, లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, గణపతి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, కార్పొరేటర్ రావర్తి విజయ, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ సుంకపాక విద్యాసాగర్, కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు కొండూరి అనిల్‌కుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాకు తరలిరావాలి

● డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రఘుశంకర్‌రెడ్డి



పెన్షన్ విద్రోహదినం గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

తిమ్మాపూర్: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ ఒకటిన జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున చేపట్టనున్న ధర్నాకు అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలిరావాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం రఘుశంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని స్థానిక మండల వనరుల కేంద్రంలో సెప్టెంబర్ ఒకటి పెన్షన్ విద్రోహదినం గోడ పత్రికను ఆవిష్కరించి వట్లాడారు. సెప్టెంబర్ ఒకటి 2004 సంవత్సరం తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ ప్రభుత్వం కల్పించే భిక్షకాదని, ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల హక్కులు కాలరాస్తున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఉద్యోగులకు ప్రవేశపెట్టే నిధులను స్టాక్ మార్కెట్‌వర్గాల చేతుల్లో పెడుతున్నారని అన్నారు. సీపీఎస్ విధానం రద్దయ్యే వరకు పోరాటం చేయాలని, సెప్టెంబర్ 1న తలపెట్టిన ధర్నాలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు బి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి జీవన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు టి తిరుపతి, ప్రవీణ్, జిల్లా కౌన్సిలర్లు ఎ రవీందర్ రెడ్డి, కార్యదర్శి కె హరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల వివరాలను జిల్లా జూడో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కడారు అనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30వ తేదీలోగా తమ ఒరిజినల్ ఆధార్‌కార్డును జూడో కోచ్ రవిమాత్రెకు అందజేయాలని తెలిపారు.

● ఎంపికైన జిల్లా బాలికల జట్టు

హన్సిక, వైష్ణవి, పి నవ్య, ఎ లక్ష్మీప్రసన్న, బి నవ్య, ఎం రమ్య, ఎ అక్షయ, వి కవిత, ఆర్ శ్రీవాణి, జె రేఖ, బి రాజేశ్వరి, పి రమ్య ఎంపికయ్యారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్లుగా ఎల్పీ రమణ, ఎం శ్రీధర్‌కుమార్ వ్యవహరించారు.

● బాలుర విభాగంలో..

వి రాహుల్, పి శివ కుమార్, టి శివకుమార్, వై భానుచందర్, ఎ ఆదిదేశవ, బి జైరాజ్, జె అరుణ్, సిహెచ్ దినేష్, హర్షవర్ధన్, కె శేఖర్ రెడ్డి, కె కళ్యాణ్, ఎ వినోద్ ఎంపికయ్యారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్గా రవిమాత్రే, జి సుధాకర్ వ్యవహరిస్తున్నారు.

నగరంలో పోలీసుల కవాతు

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని ఒకటవ ఠాణా పరిధిలో క్విక్ రియాక్షన్ టీం(క్యూఆర్‌టీ) పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు కవాతును నిర్వహించారు. కరీంనగర్ ఒకటవ ఠాణా ఎస్‌ఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఈ కవాతు నిర్వహించారు.



కవాతు నిర్వహిస్తున్న క్విక్ రియాక్షన్ టీం పోలీసులు

జిల్లాలో 0.7 మిల్లీమీటర్ల వర్షపాతం

ఆంధ్రజ్యోతి, కరీంనగర్: జిల్లాలో ఆదివారం 0.7 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదయింది. చొప్పదండి మండలంలో 6.2 మిల్లీ మీటర్లు, తిమ్మాపూర్‌లో 1.8, సైదాపూర్‌లో 0.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగతా ఎక్కడ వర్షం కురవలేదు.

గూడ్స్‌ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్ టౌన్: జిల్లా గూడ్స్ ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముద్దం రాంచంద్రారెడ్డి (ఎస్‌వీఎల్‌టీ అండ్ సాయి కృష్ణ), ప్రధాన కార్యదర్శిగా వంగల రాములు(ఎస్ఆర్ఎంటీ), ఉపాధ్యక్షుడిగా దండు అంజయ్య(బీవీఆర్), కోశాధికారిగా పుల్లూరి ఉమాశంకర్ (టీవీఎస్), సంయుక్త కార్యదర్శిగా కాల్వ రవియాదవ్(కమల్)ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మానకొండూర్: మండలంలోని లింగాపూర్ మానేరువాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆదివారం లింగాపూర్ నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3. Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.

ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!



'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోష పడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.



- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?
మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.
లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.


బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన
జంతర్‌మంతర్ :
1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ▸ ....
2. వియోనిగం ▸ ....
3. భాతంసుప్ర ▸ ....
4. చాపంయతి ▸ ....

చుక్కలు కలపండి



ఆటల్లో ఆణిముత్యాలు

- రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థినుల ప్రతిభ
- కిక్‌బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణింపు
- ప్రోత్సాహమందిస్తే మరిన్ని పతకాలు



సాయిదుర్గను అభినందిస్తున్న ఎంపీ. కవిత



బంగారు పతకంతో బీర్‌పూర్ సుప్రియ



పతకాలతో సాయిదుర్గ

సారంగాపూర్: ఇద్దరు ఇద్దరే.. బరిలో దిగితే పతకం ఖాయం. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన మడ్డి సాయిదుర్గ, బీర్‌పూర్ సుప్రియ పాఠశాల స్థాయి నుంచి క్రీడలపై ఆసక్తి. ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు వెయింట్ లిఫ్టింగ్, కిక్ బాక్సింగ్ విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ పతకాల పంట పండిస్తున్నారు. కోచింగ్ లేకుండా సొంతగా ప్రాక్టీస్ చేస్తూభేష్ అనిపించుకుంటున్నారు. కోచింగ్ ఇప్పిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తామని పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..

గ్రామానికి చెందిన మడ్డిపద్మ, రాజేశం దంపతుల కుమార్తె సాయిదుర్గ. ఐదేళ్ల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి పద్మ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పాఠశాల స్థాయిలో సాయిదుర్గ ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు జిల్లా స్థాయి పోటీలకు వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఎంపిక చేశారు. ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతో అనేక పతకాలు సాధించింది. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం సొంతం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లో జరిగిన పోటీల్లోనూ స్వర్ణం గెలుచుకుంది. కర్నాటక, హైదరాబాద్, విజయవాడ, కేరళ, మహారాష్ట్రలో నిర్వ హించిన వెయిట్ లిఫ్టింగ్ విభా గంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఐదు బంగారు, ఒక సిల్వర్ పతకం కైవసం చేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన మరో విద్యార్థిని బీర్‌పూర్ సుప్రియ. తల్లి దండ్రులు విజయ, రాజిరెడ్డి వ్యవసాయం చేస్తారు. సుప్రియ చిన్ననాటి నుంచి ఆటల్లో రాణి స్తుండడం, పాఠశాల స్థాయి పోటీల్లో చురుకుగా పాల్గొనడం గమనించిన ఉపాధ్యాయు లు, తండ్రి రాజిరెడ్డి ప్రోత్సాహ మందించారు. దీంతో వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో పసడి పతకాల పంట పండిస్తోంది. మధ్యప్రదేశ్, పంజాబ్, రంగారెడ్డి, విజయవాడ, కేరళ, మహారాష్ట్ర, కర్నాటకల్లో నిర్వహించిన జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఆరు బంగారు, ఒక సిల్వర్ పతకం కైవసం చేసుకుంది. నిజామాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, విజయ వాడల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏడు బంగారు, ఒక సిల్వర్ పతకం సొంతం చేసుకుంది.

నిమజ్జనానికి నీరేది...

- మానకొండూర్ చెరువులో నీటిని నింపడానికి ప్రయత్నించని అధికారులు
- ఆందోళనలో భక్తులు

మానకొండూర్: ఈ యేడు మానకొండూర్ మండలంలో ఆశిం చిన మేరకు వర్షాలు పడలేదు. దీంతో ఆయా గ్రామాల లోని చెరువులు, కుంటలలో నీరు లేకుండా పోయింది. మానకొండూర్ చెరువులో 22 ఏళ్లుగా కరీంనగర్‌కు చెందిన వందలాది గణేష్ విగ్రహాలతో పాటు మండలంలోని మానకొండూర్, సదాశివపల్లి, ముంజంపల్లి, శ్రీనివాస్‌నగర్, తిమ్మాపూర్ మం డలంలోని అల్గునూర్ గ్రామాలకు చెందిన గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. 22 ఏళ్లుగా మూడు క్రేన్ల సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో ఆ ప్రదేశం పూడికతో నిండిపోయింది. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలతో నీరు ఎరుపు రంగుగా మారి పంటల దిగుబడి ఆశించిన స్థాయిలో రాక పోవడమే కాకుండా చేపలు మృత్యువాత పడుతు న్నాయి. స్నానాలకు వెల్లిన యువకులకు దురదలేచి కం తులు ఏర్పడుతున్నాయిని పలుమార్లు అధికారుల దృష్టి కి తీసుకెల్లిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలే దు. గత సంవత్సరం మిషన్ కాకతీయ పథకానికి మానకొండూర్ చెరువు ఎంపికైంది. సంబందిత కాంట్రాక్టర్ చెరువు చుట్టు ప్రక్కల పూడికతీత చేపట్టి విగ్రహాలు పడే స్థలంలో పూడికతీత చేపట్టక పోవడంతో పరిస్థితి ఎప్పటి లాగే ఉంది. చెరువు కట్ట మరమ్మతుల్లో బాగంగా కట్టను వెడెల్పు చేసి ఎత్తుగా నిర్మించారు. దీంతో చెరువులో ఉన్న నీటిలో క్రేన్‌ల సహాయంతో చేస్తే ఏ ఒక్క విగ్రహం మునిగిపోయే అవకాశం ఉండదని ఒకే ప్రదేశంలో గుట్టలు గుట్టలుగా ఏర్పడి నిమజ్జనానికి ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని అధికారులు భయపడుతున్నారు. ఈ నెల 25న ప్రతిష్టించిన విగ్రహాలు నవరాత్రోత్సవాలు జరుపుకొని సెప్టెంబర్ 2న నిమజ్జనాకి వెళతాయి. అందులో బాగంగా చెరువులో నిమజ్జనానికి సరపడా నీరు లేకపోవడంతో గ్రామ పంచాయితీ పాలకవర్గం ఎల్ఎండీ నుంచి కాకతీయ కాల్వ ద్వారా మానకొండూర్ చెరువులోకి నీటిని సరఫరా చేయాలని వారం రోజు ల క్రితం కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు. అయినా అధికారలు ఎలా ంటి ప్రయత్నాలు చేపట్టక పోవడంతోగ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాకతీయ కెనాల్ ద్వారా చెరువులోకి నీటి ని సరఫరా చేయాలని భక్తులు కోరుతున్నారు.



నీరు లేక వెలవెల పోతున్న మానకొండూర్ చెరువు

అధ్వానంగా రహదారులు..

- చిరు జల్లులకే చిత్తడిగా మారిన పల్లె రోడ్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



కాసారం, గర్శకుర్తి గ్రామాల మధ్య అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

గంగాధర : ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాల్సిన పాలకులు, అధికార యంత్రాంగ పట్టింపు లేని దోరణి వల్ల గంగాధర మండలంలోని పలు గ్రామాల రోడ్లు చిరు వర్షపు జల్లులకే అధ్వానంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారు.ఇటీవల కురిసిన చిరు వర్షాలకు గుంతలు పడిన మట్టి రోడ్లపై నీరు నిలిచి చిత్తడిగా మారాయి. మండలంలోని హిమ్మత్ నగర్ గ్రామం నుంచి వెదిర వరకు గల మూడు కిలో మీటర్ల రోడ్డు అడుగడుగున గుంతలు పడి వర్షాలకు గుంతల్లో నీరు నిలిచాయి. ఈ రూట్లో వెళ్లే హిమ్మత్‌నగర్, గట్టుభూత్కూర్ గ్రామాల ప్రజలువాహనాలు, నడిచి వెళ్లలేక అనేక అవస్థలు పడుతున్నారు. తాడిజెర్రి నుంచి హిమ్మత్ నగర్ వచ్చే రోడ్డు మరి అధ్వానంగా మారింది. కాసారం, తడగొండ వెళ్లాల్సిన గర్శకుర్తి గ్రామం మీదుగా వెళ్లే రహదారి కూడా అనేక చోట్ల గుంతలు పడి నీరు నిలిచి పాదచారులు నడిచి వెళ్లలేని విధంగా తయారు అయ్యింది. గర్శకుర్తి తడగొండకు నాలుగు కిలో మీటర్లు, కాసారం నుంచి గర్శకుర్తికి మూడు కిలో మీటర్ల పొడవున రోడ్డు చిత్తడిగా మారి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. తిర్మలపూర్ నుంచి కోట్ల నర్సింహులపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రానైట్ లారీలు ఓవర్ లోడ్‌తో నడ వడం వల్ల మట్టి రోడ్లతోపాటు గంగాధర చౌరస్తాలోని తారు రోడ్డు ప్రజలు నడువలేని విధంగా మారాయి.అధికార యంత్రాం గం ఈ రహదారిపై నుంచే వచ్చి వెళ్తున్నా పట్టించుకున్న వారే కరవు అయ్యారు. సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు పట్టించుకుని రోడ్లకు కనీస మరమ్మతులు చేట్టాలని ప్రజలు కోరుతున్నారు.



హిమ్మత్‌నగర్, వెదిర మధ్య బురదమయంగా మారిన రహదారి



ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు

